# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

telugprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

మంగళవారం 1-8-2023




పార్లమెంట్‌లో ఫైట్..

## ఉభయ సభలు వాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

పార్లమెంట్ సమావేశాలు ఇటీవల ఎన్నడూ లేనంతగా వాడివేడిగా జరుగుతున్నాయి. అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ప్రధానంగా మణిపూర్ అంశం పార్లమెంట్‌ను కుదిపేస్తోంది. మంగళవారం కూడా రాజ్యసభలో విపక్ష ఎంపీలు మణిపూర్ అంశంపై ప్రధాని మాట్లాడాలని డిమాండ్ చేశారు. నినాదాలతో సభను హోరెత్తించారు. అయితే చర్చకు సమయం కేటాయించామని రాజ్యసభ ఛైర్మన్ చెబుతున్నా.. విపక్ష ఎంపీలు పట్టు వీడలేదు. దీంతో ఎంపీల తీరుపై ఛైర్మన్ ధన్‌కడ్ మండిపడ్డారు. అయినా విపక్ష ఎంపీలు నిరసనలు కొనసాగించడంతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.



# వ్యూహం రెడీ



### అసెంబ్లీలో ప్రతిపక్షాల విమర్శలు తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధం

## ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశా నిర్దేశం

**అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచే ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల వేదికగా అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు ప్రణాళికలు రచిస్తున్నాయి. అయితే.. వాటికా అవకాశం ఇవ్వకుండా ఎదురుదాడితో వాటిని పైకి లేవకుండా తిప్పికొట్టాలనే యోచనలో అధికార బీఆర్ఎస్ ఉంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ మేరకు ఎమ్మెల్యేలకు, మంత్రులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది.**

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలుగుప్రభ):**

త్వరలోనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలుండటం, ప్రభుత్వానికి ఇవే చివరి సమావేశాలు కానుండటంతో అసెంబ్లీ సాక్షిగానే ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. అంతేకాకుండా తాముచేసిన పనుల్ని, తద్వారా ప్రజలకందిన సంక్షేమ ఫలాల్ని వివరిస్తూనే మరోవైపు ప్రతిపక్షాల విమర్శలు అర్థం పర్థం లేనివంటూ తమ వాణిని ధ్వనింపచేసేందుకు వ్యూహరచన చేస్తున్నారు. వ్యవసాయానికి పన్నెండు గంటల ఉచిత కరెంట్ అవసరం లేదన్న కాంగ్రెస్ వైఖరిని బలంగా తూర్పారబట్టే పనిలో పార్టీ ముఖ్యనేతలున్నారు. ఈమేరకు సభలో ఎవరేం మాట్లాడాలో, తారకరామారావు దిశానిర్దేశం చేయనున్నారు. ఎవరి ఊహకందని విధంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం.. అన్నివర్గాల వారిని తాము ఎలా కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామో బలంగా వినిపించే అవకాశం ఉంది. ఒక రకంగా చెప్పాలంటే ఎన్నికల ప్రచారానికి అసెంబ్లీ నుంచే శంఖారావం పూరించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. మరోవైపు ధరణి, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, తదితర పథకాల గురించి ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతుండగా, వాటిని ధీటుగా ఎదుర్కొనేందుకు అవసరమైన వివరాలు సమకూర్చుకొని ధీటుగా బదులిచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

మహారాష్ట్ర వంతెన పనుల్లో ప్రమాదం

## 17 మంది కార్మికులు మృతి

**ముంబై, ఆగస్టు 1(తెలుగుప్రభ):**

మహారాష్ట్రలోని థానే జిల్లా షాపూర్‌లో ఎక్స్‌ప్రెస్‌హైవే పనుల్లో భాగంగా వంతెన పనుల్లో ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంలో గిర్డర్ లాంచర్ యంత్రం కుప్పకూలి 17 మంది కార్మికులు మరణించారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. సమృద్ధి ఎక్స్‌ప్రెస్ హైవే ఫేజ్-3 పనుల్లో భాగంగా వంతెన నిర్మిస్తున్నారు.

దాదాపు వంద అడుగుల ఎత్తునుంచి గిర్డర్‌యంత్రం కుప్ప కూలిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం తెలిసిన వెంటనే సంఘటనస్థలికి చేరుకున్న పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం,అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇంకొందరు శిథిలాల కింద చిక్కుకొని ఉంటారని భావిస్తున్నారు. ఘటనాస్థలాన్ని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పరిశీలించారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఈడీ రైడ్స్

**హైదరాబాద్, ఆగస్టు 1(తెలుగుప్రభ):**

హైదరాబాద్ నగరంలో మరోమారు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు జరుగుతున్నాయి. ఈరోజు తెల్లవారుజాము నుంచే మలినేని సాంబశివరావు నివాస గృహంలో తనిఖీలు చేపట్టిన ఈడీ అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో అతనికున్న ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. ఏకకాలంలో 15 బృందాలుగా ఈడీ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. మలినేని సాంబశివరావు ట్రాన్స్‌పవర్, టెక్నో ఇన్‌ఫ్రాటెక్, కాకతీయ క్రిస్టల్ లిమిటెడ్ ట్రాన్స్ ట్రైరోడ్ ప్రాజెక్ట్ కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ దాడులు, తనిఖీలకు కారణాలేమిటన్నది మాత్రం తెలియరాలేదు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు ఇంట్లోనూ ఈడీ సోదాలు జరుగుతున్నాయి. అక్కడా మంగళవారం తెల్లవారు జామునుంచే ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి.






## తమిళనాడులో ఎన్‌కౌంటర్

– ఇద్దరు రౌడీషీటర్ల మృతి

**చెన్నయ్, ఆగస్టు 1(తెలుగుప్రభ):**

చెన్నయ్ సమీపంలోని గుడువంచేరి వద్ద పోలీసులు కాల్పులు జరపడం తీవ్ర కలకలం రేపింది. పోలీసుల ఈ కాల్పుల్లో ఇద్దరు రౌడీషీటర్లు మృతిచెందారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు, సోమవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసులు రహదారిపై వెళ్తున్న ఒక వాహనాన్ని ఆపాల్సిందిగా సూచించారు. అందులోని వ్యక్తులు వాహనాన్ని ఆపకపోగా పోలీసుల వాహనాన్ని ఢీకొట్టారు. అంతేకాకుండా పోలీసులపై దాడి చేసి బాంబు విసిరారు. దాంతో పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డవారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు మరణించినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఘటనలో ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలయ్యాయని, మృతులు గతంలో పలు హత్యకేసుల్లో నిందితులని పేర్కొన్నారు. వారిలో మరో ఇద్దరు పోలీసులకు దొరకకుండా పారిపోయారని తెలిపారు.



# చూడండి కళ్లుంటే..!

– పట్టణాల్లోని అభివృద్ధిని కళ్లకు కడుతున్న మంత్రి కేటీఆర్

– ప్రతిపక్షాలకు సమాధానంగా ట్విట్టర్ ద్వారా వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 1(తెలుగుప్రభ):**

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏం చేశారని అడుగుతున్న ప్రతిపక్ష పార్టీలకు సమాధానంగా మాటల కంటే దృశ్యసహితంగానే వివరించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. భారీ ప్రాజెక్టులైన కాళేశ్వరం, మిషన్ భగీరథ, యాదాద్రిల గురించి పదే పదే చెప్పాల్సిన అసరం లేదని భావిస్తోన్న మంత్రి కేటీఆర్ రాష్ట్రంలోని హైదరాబాద్ మహానగరంలో వరద నివారణకు చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులతో పాటు తమ మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలోనే వివిధ పట్టణాల్లో అభివృద్ధి చేసిన జంక్షన్లు, నిర్మించిన వైకుంఠ ధామాలు తదితరమైన వాటిని ఫోటోలతో సహ ట్విట్టర్ ద్వారా షేర్ చేస్తున్నారు. ప్రజల కవసరమైన రహదారులు, జంక్షన్లు, నీటి సరఫరా, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఆయా పట్టణాల్లోని జంక్షన్లను వివిధ థీమ్‌లతో, వివిధ ఆకృతులతో చూడముచ్చటగా తీర్చిదిద్దడం వల్ల ఆయా పట్టణాలకే కొత్త శోభ వచ్చింది. కళ్లుంటే చూడండి అన్నట్లుగా విడతల వారీగా ఆయా అభివృద్ధి పనులను ఫొటోల సహితంగా 'కేటీఆర్ న్యూస్' హ్యాండిల్ నుంచి చూపుతున్నారు. వేయి మాటలకంటే ఒక్క ఫొటో చాలన్నట్లుగా జరిగిన అభివృద్ధి పనుల్ని షేర్ చేస్తున్నారు. ఇప్పటికీ నమ్మలేనివారికి ఇంకేం చెబుతాం అన్నట్లుగానే కాకుండా ఇప్పటికైనా కళ్లు తెరచి చూడండి అన్నట్లుగా వాటిని చూపుతున్నారు. అందులో భాగంగా నల్లగొండ, సిరిసిల్లా, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిర్మల్, రామగుండం, నాగారం, హుజూరాబాద్, జమ్మికుంట, కరీంనగర్, చెన్నూరు, భైంసా, సిద్ధిపేట, సూర్యాపేట, ఖమ్మం, జగిత్యాల, వేములవాడ, ఎల్లందు, ధర్మపురి, వరంగల్, మహబూబాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్, తదితర పట్టణాల్లోని జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ దృశ్యాలను పొందుపరిచారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అభివృద్ధి పరిచిన న్యూ అట్రాక్షన్లనూ వీడియోద్వారా చూపించారు. ఎస్ఎన్‌డీపీ ద్వారా వరద నివారణ పనులు చేపట్టాక వరద సమస్యలు తగ్గి ప్రజలు ప్రశాంతంగా ఉండగలుగుతున్నారంటున్న ప్రజావాణిని సైతం వినిపించారు. నాడు చినుకు పడితే వణికిన జనమే నేడు కుంభవృష్టి కురిసినా ధీమాగా ఉన్నారని పేర్కొన్నారు. అంతేకాదు ఒక్కో పట్టణం, నగరంలో జరిగిన వివిధ అభివృద్ధి పనుల్ని చూపించారు. హైదరాబాద్ నగరంలో లంగ్‌స్పేస్ పెంచేందుకు అభివృద్ధి చేసిన థీమ్‌పార్కులు, కాలనీ పార్కులు, పంచతత్వ పార్కులు తదితరమైనవి వెల్లడించారు. అలా సనత్‌నగర్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లితో సహ 50 ప్రాంతాల్లోని పార్కుల్ని, ఓపెన్ జిమ్‌లను కళ్ల ముందుంచారు.



